

# కృతి – ఆకృతి

– అపర్ణ మునుకుట్ల గునుపూడి



## 06

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, రాగ, భావములను ప్రస్తావించి, మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే అయినా వాటి సాహిత్య, రాగ, భావ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు. పల్లవి, అనుపల్లవి, పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

ఈ నెల ఆశ్వయుజ మాసం. శరన్నవరాత్రులు, దసరా పండుగ ప్రారంభం అవుతాయి. అందులో ముగురమ్మలని (పార్వతి, లక్ష్మి, సరస్వతి) కొలవడం పరిపాటి. ముగురమ్మల పండగకి ఏ ఒక అమ్మ మీద రాసినా మిగతా ఇద్దరూ అలిగి శపిస్తారేమోనని ముగ్గురిని స్తుతించే మూడు కృతులని ఎన్నుకున్నాను. అలాగే అక్టోబర్ నెలలో మనకి దసరా పండుగలు రావడం, అందులో స్త్రీ మూర్తులని పూజించడం, అదీ స్త్రీల పండుగగా పేరంటాలు, ఆడపిల్లలు బొమ్మల కొలువు వేడుకలు జరుపుకోవడం, అదే నెలని ప్రపంచవ్యాప్తంగా "breast cancer awareness month" అని ప్రకటించడం, కేవలం కాకతాళీయం కాకుండా దైవ సంకల్పమేమో అనిపిస్తుంది. ఆ సందర్భంగా ఆడవాళ్లందరినీ తఱచు స్థన పరీక్షలు చేసుకోమని, క్రమం తప్పకుండా వైద్యులని సంప్రదించమని, ఆరోగ్యరీత్యా గమనికగా ఉండమని మా విన్నపం.

గాత్రం: శ్రీలక్ష్మి కోలవెన్ను

రచన: శ్యామ శాస్త్రి

రాగం: కాంభోజి

తాళం: ఆది తాళం

పల్లవి: దేవి నీ పద సారసములే దిక్కు వేరే గతి ఎవ్వరమ్మా

అనుపల్లవి: శ్రీ వెలయు మధుర నెలకొన్న చిద్రూపిణి శ్రీ మీనాక్షమ్మ

చరణం: ఉమా రమా శ్యామకృష్ణనుతే గిరి కుమారి కౌమారి

నీ సమానమెవరు బ్రోవ నీకు భారమా జగత్సాక్షి మీనాక్షి

తామసము జేసితేనిక నీకిది న్యాయమా ఇంత జాగేలనే

వేమారు నీ పద దర్శనములనిచ్చి నీ మాటలు వినగా వచ్చితినమ్మా

Click Here to Listen

శ్యామశాస్త్రి గారు దేవి, శ్రీవిద్యా ఉపాసకులు, బంగారు కామాక్షి భక్తులు. వీరి వంశీకులు శంకరాచార్యుల వారిచే బంగారు కామాక్షి అర్చకత్వానికి నియమింపబడినవారు. వీరికి అమ్మవారు ప్రత్యక్షమవడం, ఆవిడతో వీరు సంభాషించడం తఱచు జరిగేవిట. దేవీ పూజ చేస్తూ ఆ భక్తి పారవశ్యంలో తన్మయులైన తరుణంలో ఎన్నో కృతులు వెలువడినవి అంటారు. అందుకే వీరి కృతులు అధికంగా అమ్మవారిమీదనే. మధుర మీనాక్షిమీద నవరత్నమాలికగా తొమ్మిది కృతులు రచించారు అని తెలుస్తున్నది. అందులో ఈ కృతి ఒకటి. అన్ని కృతుల్లాగే ఇది కూడా అమ్మవారిని

స్తుతిస్తూ ఆవిడని కటాక్షించమని వేడుకునే కృతి. పల్లవిలో దేవి నువ్వు తప్ప వేరే గతి ఎవరు, నీ పాదపద్మములే (సరస్సులో పుట్టినవి సారసములు) నాకు దిక్కు అంటారు. అనుపల్లవిలో ఆవిడ ఉండే నెలవు, అంటే మధురాపురిలో శ్రీ కళలతో చిరునవ్వులు చిందే రూపంతో ఉన్న మీనాక్షిని వర్ణిస్తూ ఇక చరణంలో సాహిత్యం ఏకవచన సంబోధనలో నడుస్తుంది. పర్వతరాజ కుమారి, నీకు సరితూగగలవారెవ్వరు, నన్ను బ్రోవడానికి నీకు భారమా, ఎందుకు ఇంకా ఆలస్యం చేస్తున్నావు, నీకు ఇది న్యాయంగాదు, ఓ మీనాక్షి నిన్ను పార్వతి, లక్ష్మి , వారితోపాటు నేనుకూడా స్తుతి చేస్తున్నాను అంటూ, పల్లవిలో దేవి నీ పద పద్మాలే దిక్కు అన్నందుకు అది ఎందుకో వివరిస్తూ ఆవిడ పద దర్శనాన్నిమ్మని, ఆవిడ మాటలు వినడానికి వచ్చేను అని పలు విశేషణాలతో పోలుస్తారు. సాహిత్యం చూస్తే వారు అమ్మవారితో పిచ్చాపాటి మాట్లాడుతున్న ధోరణిలో ఉంటుంది.

ఈ కీర్తన సరళంగా ఉండి సులువుగా బోధపడుతుంది కనక, శ్యామ శాస్త్రి గారి రచనలు, వారి పాండిత్య పటిమ గురించి కాస్త ప్రస్తావించుకుందాం. వీరు సంస్కృతాంధ్రములలో ప్రావీణ్యులైనా ఎక్కువగా తెలుగులో రచించేరు. అవి శులభమైన పదాలతో కదళి పాక శైలిలో ఉంటాయి. ఈ నవరత్న మాలిక కృతులని వారు మధురలో గుడికి వెళ్లి అక్కడ గానం చేసేరని ప్రతీతి. ఆ సమయంలో "మాయమ్మా" అన్న కీర్తన పాడుతుండగా అమ్మవారు కనికరించి అక్కడవున్న ఒకరిపై పూని వారు శ్యామశాస్త్రి అని చెప్పి, వారిని తగు మర్యాదలతో గౌరవింపవలెనని చెప్పినదిట. వెంటనే అర్చకులు వారిని గుర్తించి వివిధ రీతులలో గౌరవించేరుట. ఆనాటి నుండి ఇప్పటికి మధురలో వారి వంశీయులకు ఆలయ మర్యాదలతో గౌరవించుతారుట. ప్రస్తుతం ఈ కృతులలో ఏడు కృతులు మాత్రం ప్రచారంలో ఉన్నాయి. వాటిల్లో మిగతా ఆరు కృతులు, సరోజ దళ నేత్రి – శంకరాభరణం, దేవి మీననేత్రి – శంకరాభరణం, మరి వేరే గతి – ఆనంద భైరవి, నన్ను బ్రోవు లలితా – లలిత, మాయమ్మా – ఆహిరి, మీనలోచని – ధన్యాసి. మిగతా రెండూ దొరకలేదు. వీరు కంచి కామాక్షి మీద రచించిన స్వరజతులు, సంగీతంలోనూ, సాహిత్యంలోనూ కూడా అతి ఉత్కృష్ట స్థాయిలో ఉంటాయి. అవి కామాక్షి అనుదినము – భైరవి, కామాక్షి పదయుగము – యదుకుల కాంభోజి, మరియు రావే హిమగిరి కుమారి కంచి కామాక్షి – తోడి. ఈ స్వరజతులు నృత్యానికే కాకుండా ఉన్నత సభలలో కచేరీల్లో పాడతగ్గ అత్యుత్తమ స్థాయిలో ఉంటాయి. అందుకే వీటిని రత్నత్రయం అంటారు. శాస్త్రిగారు సాహిత్య సంగీతాల్లోనే కాకుండా తాళంలో కూడా ఉద్దండపండితులు. ఒక కృతిని ఒక తాళంలో రచిస్తే దాన్ని స్థాపిత తాళమంటారు. అలా కాకుండా సావేరి రాగంలో శంకరి శంకురు చంద్రముఖి అన్న కృతిని రెండు తాళాల్లో అంటే రూపక తాళం, ఆది తాళంలో పాడగలిగేట్టు రచించారు. అప్పుడు రూపక తాళం స్థాపిత తాళంగానూ, ఆది తాళం సూచిత తాళంగానూ పరిగణించబడతాయి. దాన్ని ఏ తాళంలో పాడినా ఆ కృతియొక్క

సాహిత్యానికి భంగం రాకుండా ఉంటుందన్నమాట. అలాగే ఒకే కృతిలో మూడు భాషలు (సంస్కృత, ఆంధ్ర, తమిళం) ప్రయోగించి రచించారు. దానిని "మణి ప్రవాళ సాహిత్యం" అంటారు. ఇటువంటి చమత్కారముల్లో, చింతామణి, కల్గడ వంటి అపూర్వ రాగాల్లో కృతులు రచించడంలో వీరికి వీరే సాటి. వారి నవరత్నాలు, రత్న త్రయం, ఇవే కాకుండా వారి ప్రతి ఒక్క కృతి ఒక రత్నం. వారి కృతులు, వాటిల్లోని భక్తి భావం, రాగ భావం, లక్షణయుతమైన సంగతులు వింటుంటే అమిత భక్తి పారవశ్యం ఆవహించి మన హృదయాన్ని కరిగింపజేస్తాయి. అవకాశం ఉన్నప్పుడు మిగతా కృతులు కూడా వింటారని ఆశిస్తున్నాను. అమ్మవారి కరుణా కటాక్షమే ఈ కృతి రూపంలో మనకందరికీ అందిందనడంలో అతిశయోక్తి లేదు.

శ్రీలక్ష్మి కోలవెన్ను కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొందిన కళాకారిణి. భారత దేశంలోనూ, శాన్ఫ్రాన్సిస్కో బే ఏరియా లో అనేక కచేరీలు చేస్తారు. ఎన్నో నృత్య రూపకాలకి సంగీతం కూర్చి, సంగీత దర్శకత్వం వహించి, పెక్కు రంగప్రవేశాలకి గాత్ర సహాయం అందించేరు. పలు అన్నమాచర్య కీర్తనలు స్వరపరచేరు. వీరు శాన్ఫ్రాన్సిస్కో బే ఏరియాలో నివసిస్తూ ఉంటారు.

★★★

గాత్రం: తనికెళ్ళ చంద్ర భాను

రచన: మైసూరు వాసుదేవాచార్యులు

Click Here to Listen

రాగం: వసంత

తాళం: ఆది తాళం

పల్లవి: దేవి రమే మామవాబ్ధితనయే దేవ దేవ వాసుదేవ జాయే

అనుపల్లవి: పావన కనకాద్రి వర నిలయే దేవాది వినుత మహిమాతిశయే

చరణం: రాకాధీశ సన్నిభ వదనే రాజీవ లోచనే గజ గమనే

లోకానంద విధాయిని లోకవిదిత కీర్తి శాలిని అకారాది వర్ణ

స్వరూపిణి తవ కరుణాపూర్ణ భక్తానాం అనుపమ

సౌభాగ్య దాయిని అమందానంద సందోహ దాయిని

లక్ష్మీదేవిని ఎన్ని విధాలుగా స్తుతి చేసినా తనివి తీరదు. అది ఆవిడ ప్రత్యేకత. వాసుదేవాచార్యులు గారు ఈ కృతిలో లక్ష్మి ని బహుధా స్తుతిస్తారు. పల్లవిలో సముద్రుని కుమార్తె, దేవదేవుడైన వాసుదేవుని హృదయాన్ని జయించిన రమా దేవి నన్ను రక్షించు అని, అనుపల్లవిలో సువర్ణ శోభలతో ఉన్న పర్వతంపై నివశిస్తుందని, ఎన్నో మహిమలతో వెలుగుతూ ఉండే ఆవిడని దేవ దేవాదుల పొగడుతూ ఉంటారని, చరణంలో పూర్ణచంద్రుని బోలిన వదనంతో, అందమైన కన్నులతో, సున్నితమైన నడకతో, లోకమంతటికి ఆనందాన్ని కలిగించగలశక్తితో, జనులందరికీ తెలిసిన కీర్తితో, అక్షరరూపిణియని, ఆవిడని కరుణతో పూజించే భక్తులకి ఎనలేని సంతోష, సౌభాగ్యాలు అందించుతుందని వర్ణిస్తారు. ఇందులో అమందానంద సందోహ దాయినే అన్న చిత్రమైన ప్రయోగం చేస్తారు. సాధారణంగా ఎవరైనా కష్టాల్లో ఉంటె “మంద భాగ్యులు” అంటారు. మంద అంటే మెల్లిగా అని అర్థం. అమందానందం అంటే మందకొడిగా కాకుండా చురుకుగా ఆనందంగా ఉండడం, అలాగే సంతోష దాయినే అనకుండా సందోహ దాయినే అంటారు. సందోహం అంటే ఎవరికీ వారే కాకుండా గుంపుగా కోలాహలంగా ఉండడం. ఆవిడ అందరికీ ఆనందంగా, చురుకుగా, చలాకీగా, ఏక కోలాహలంగా ఉండే వరం ఇస్తుంది అంటారు.

ఇంత క్రితం చెప్పుకున్నట్టు లక్ష్మి దేవి సహజంగా సౌందర్యవతి. దానికి తోడు, ఐశ్వర్యవతి. తన కనుసన్నలతోనే లోకాన్ని కటాక్షించగల కరుణామూర్తి. అయినా పరమ నిరహంకారి. ఆవిడ జననం భాగవతంలో అతి మనోహరంగా వర్ణిస్తారు పోతన గారు. క్షీర సాగర మథన సమయంలో సముద్రంలోంచి వివిధ వస్తువులు – శంఖం, చక్రం, కల్ప వృక్షం, జంతువులు – కామధేనువు, ఐరావతం, ఉచ్చైశ్రవము, ఆ తరువాత అప్సరలు, చంద్రుడు పుట్టిన తర్వాత లక్ష్మి దేవి పుడుతుంది. చంద్రునికి తోడపుట్టినది కనక చంద్ర సహోదరి అయ్యింది. చక్కని దేహ కాంతితో, చారడేసి కళ్ళతో, చిరునవ్వు చెరగని మోముతో ఆవిర్భవించిన లక్ష్మీ దేవికి, దేవతా స్త్రీలు సపర్యలు చేసి అభ్యంగన స్నానం చేయించి

అలంకరించగా, తండ్రి సముద్రుడు పట్టుబట్టలు పెట్టేడుట, వరుణుడు వైజయంతి మాల ఇచ్చేడుట, విశ్వకర్మ వడ్డాణం, హారాలు వంటి నగలు ఇచ్చేడుట. పలుకుల రాణి శ్వేతాంబరధారిణి అయిన సరస్వతి ముత్యాల హారం ఇచ్చిందిట. ఇది చూస్తే మన పురాణకాలంలోనే ఇచ్చి పుచ్చుకునే ఆనవాయితీ ఉందని తెలుస్తుంది.

ఇక్కడ లక్ష్మి దేవి గురించి, ఆవిడ లక్షణాల గురించి తరచి చూస్తే, కలిమికి రాణి అయిన ఆవిడకి ఒకరు బట్టలూ, నగలు ఇవ్వడం ఏమిటీ? ఆవిడ అపురూపంగా అందుకోవడం ఏమిటీ అనిపించవచ్చును. అంటే పిల్లలు ఎంత సంపన్నులైనా తలితండ్రులు ఇచ్చే వస్తువులని తక్కువ చేయకూడదు అని తెలుపుతోంది ఆ మహాలక్ష్మి . తక్కినవారు వారి వాత్సల్యంతో, స్నేహాభిమానాలతోను ఇచ్చిన వస్తువులని విలువకట్టలేము అన్న భావం ప్రదర్శించి ఆవిడ నిరహంకారత్వాన్ని సూచిస్తోంది. శాస్త్రాల్లో "ఉచితానుచిత విచారణం న కురుతే" అన్నారు. అంటే ఉచిత అనుచిత విచారణ చెయ్యకూడదు అని అర్థం. ఎక్కడ అలా చేయకూడదు అంటే, ప్రేమ, కరుణ, అభిమానం, స్నేహం చూపడానికి హెచ్చు తగ్గులు పాటించరాదు అని. గొప్పవాళ్ళని గొప్పగా చూడడం, తక్కువ వాళ్లని తీసి పారెయ్యడం లాంటి అలవాట్లు ఉండకూడదు అని చాటి చెబుతోంది. ఇక్కడ ముచ్చట ఏమిటంటే లక్ష్మీ దేవికి అన్నీ ఉన్నాయికదా ఆవిడకి మనం ఇవ్వడమేమిటి అని వాళ్ళు అనుకోలేదు. వీళ్ళు నాకిచ్చేదేమిటి అన్న అహంకారం ఆవిడా పాటించలేదు. ఇక అసలైన మహత్ లక్షణం, ఆవిడ తనవద్ద ఉన్న సంపదలు వీరు వారు అని పాటించకుండా పంచిపెట్టే గుణం. ఒక్క ధనమే కాదు, ధాన్యమే కాదు, విద్య, విజయ, సంతానం ఒకటని కాకుండా తనవద్ద ఉన్నసంపదలు సమృద్ధిగా పంచి పెట్టి తనకున్నది మరొకరికి పంచడంలో ఉన్న ఆనందాన్ని నిరూపించి అష్టలక్ష్మి అన్న పేరు తెచ్చుకున్న ఆవిడ మనకి ఒక గొప్ప నిదర్శనం. లక్ష్మి దేవిని పూజించినప్పుడల్లా, తమకున్నది అందరికి పంచడం అన్న లక్షణాన్ని అలవర్చుకుని పాటిస్తే, లక్ష్మి వేరే ఎక్కడో లేదు మనందరిలోనే ఉంది అన్న భావాన్ని నిరూపిస్తూ, ఒక్కొక్కరూ ఒక లక్ష్మి అవతారాలవగలరని బలంగా నమ్ముతున్నాను.

తనికెళ్ళ చంద్ర భాను కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొందిన ఏ. ఐ. ఆర్ కళాకారిణి. దుర్గాబాయి దెష్ముఖ్ సంగీత కళాశాలలో సంగీతాచార్యులుగా పని చేస్తున్నారు. దేశ విదేశాల్లోను, టీటీడీ, ఎస్ వి బి సి ఛానెల్ లోను విరివిగా కచేరిలు చేస్తుంటారు. ప్రస్తుతం బెంగళూరు నివాసస్తులు.

★★★

గాత్రం: ఈమని వాసవాంబ

రచన: హరికేసనల్లూర్ ముత్తయ్య భాగవతార్

రాగం: కీరవాణి

తాళం: ఆది తాళం

పల్లవి: అంబ వాణి నన్ను ఆదరింపవే

Click Here to Listen

అనుపల్లవి: శంబరారి వైరి సహోదరి కంబుగళ సిత కమలేశ్వరి

చరణం: పరదేవి నిన్ను భజియింప నిజ భక్తులను బ్రోచే పంకజాక్షివి

వరవీణాపాణి వాగ్విలాసిని హరికేస పుర అలంకారి రాణి

సరస్వతి దేవి మీద అతి సరళమైన, అతి తక్కువ పదాలతో సంక్షిప్తంగా ముత్తయ్య భాగవతార్ రచించిన కృతి ఇది. వాణి పేరుకి తగ్గట్టు కీరవాణి రాగంలో కట్టేరు. పల్లవిలో ఓ వాణీ, అంబా! అన్ను ఆదరించమని వేడుకుంటూ, అనుపల్లవిలో శివుడికి చెల్లెలుగాను, శంఖంలాంటి కంఠంతో అందంగా ఉండి, కమలాలకి అధిపతిగాను వర్ణిస్తారు. చరణంలో ఆ దేవిని భజించే భక్తులందరిని పాలించే పంకజాక్షి, చేతిలో వీణతో, వాక్కులందు విలసిల్లే అంటే పలుకుల తల్లి, హరికేశాపురానికి రాణి నన్ను ఆదరించు అంటారు.

ఈ కృతికి కీలక సమాసం శంబరారివైరి. శంబర, అరి, వైరి ఇది మూడు పదాల సమాసమే అయినా సరస్వతి ఎవరి చెల్లెలో నిర్ణయించే సమాసం. శంబరాసురుడు, వానికి శత్రువు ప్రద్యుమ్నుడు, వానికి శత్రువు శివుడు, అతనికి చెల్లెలు సరస్వతి. శంబరాసురుడికి ప్రద్యుమ్నుడికి వైరం మామూలే, ఆదినుండి ఉన్న సురాసుర శత్రుత్వం. కానీ ప్రద్యుమ్నుడికి శివుడికి ఉన్న వైరం ఏమిటి? చాలా పెద్ద కథ చెప్పేటటువంటి అనూహ్యమైన ప్రయోగం ఈ సమాసం.

ఈ సమాస మూలం తెలుసుకోవాలంటే మనం భాగవతంలో దశమ స్కందానికి వెళ్ళాలి. శివుడి ఫాలనేత్రానికి దగ్ధమైన మన్మధుడు విష్ణుమూర్తి అనుగ్రహంతో రుక్మిణి, కృష్ణుల శిశువు ప్రద్యుమ్నుడుగా జన్మిస్తాడు. శంబరాసురుడికి ప్రద్యుమ్నుడే తన ప్రాణాంతకుడని తెలిసి తన మాయాజాలంతో ఆ శిశువుని అపహరించి సముద్రంలో పారవేస్తాడు. ఆ శిశువుని ఒక చేప మింగేస్తుంది. జాలరివాళ్ళు ఆ చేపని పడతారు. అది చాలా పెద్దగా ఉండడం వలన వారు రాజుగారిని మెప్పించ దలచి శంబరుడి కొలువుకి పట్టుకెళతారు. శంబరుడు మెచ్చి దాన్ని వంటశాలకి పంపిస్తాడు. అక్కడ చేపని తరిగితే శిశువు బయటపడతాడు. పార్వతి కల్యాణంలో మన్మధుడి దహనానంతరం రతీదేవి పతివ్రతయై మాయావతి అనే పేరుతొ శంబరుడి కొలువులో చేరి కాలం గడుపుతూ ఉంటుంది. ఆ శిశువు వార్త విని మాయావతి వచ్చి తాను ఆ బాలుడిని పెంచుకుంటానని చెప్పి వాని ఆలనా పాలనా చూస్తుంది. ప్రద్యుమ్నుడు దిన దిన ప్రవర్ధమానమవుతూ యవ్వనంలో అడుగుపెట్టేప్పటికిని అతి సుందరాకారుడుగా తయారవుతాడు. మాయావతి రూపంలో ఉన్న రతీదేవి అతన్ని మోహించి కామాన్ని వ్యక్తపరుస్తుంది. ప్రద్యుమ్నుడు ఆశ్చర్యపడి ఇన్నాళ్లు తల్లిలాగ పెంచి ఇప్పుడు ఈ వికారక్రియలేమిటి అంటాడు. అప్పుడు రతీదేవి తమ పూర్వ వృత్తాంతం అంతా చెప్పి, ఆతడే మన్మధుడుగా గుర్తు చేసి, శంబరుడు మహా మాయావి అని, ప్రద్యుముని సంహరించే ప్రయత్నంలో ఉన్నాడని, అతన్ని అంతం చేయడానికి మరిన్ని మాయలు పన్నాలని చెప్పి తనకు తెలిసిన మయా విద్యలు నేర్పుతుంది. ప్రద్యుమ్నుడు మాయావతి నుండి మహా మాయ విద్య నేర్చుకుని శంబరాసురుడితో యుద్ధానికి వెళ్లి తన పరాక్రమంతోను, మయా విద్యలతోను అతని శిరస్సు ఖండించి అతన్ని అంతం చేస్తాడు. దేవతలందరు సంతోషించి ఆతని దీవిస్తారు. ఆ తరువాత, రతిదేవితో కలిసి ఇరువురు ద్వారకకు చేరుకుంటారు. పురజనులందరూ అతన్ని చూసి శ్రీకృష్ణుని పోలిన ఈ రూపవంతుడెవరా అని ఆశ్చర్యపోతూ చూస్తారు. సమయానికి నారదుడు వచ్చి కథంతా రుక్మిణికి వివరిస్తాడు. రుక్మిణి పరమానందంతో కొడుకుని కోడలిని దగ్గరకు చేర్చుకుంటుంది. దీనంతటి వెనకాల వాసుదేవుని హస్తం ఉందన్న విషయం విడిగా చెప్పక్కరలేదు. ఈ కథ తెలియగానే ప్రద్యుమ్నుడికి (మన్మధుడు) శివుడికి ఉన్న వైరం తేటతెల్లం అవుతుంది. ఆ చిన్న సమాసంతో ఇంత గొప్ప కథని చెప్పగలవారు, ఇంతటి మహత్తరమైన సమాస ప్రక్రియలు ఉపయోగించారు కనకే భాగవతార్ గారు 20వ శతాబ్దంలో వాగ్గేయకారుల్లో అగ్రగణ్యులయ్యారు.

సంగీతమపిసాహిత్యం సరస్వత్యే స్థనద్వయం

ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతం

సంగీతం సాహిత్యం సరస్వతికి రెండు స్థనాలయితే, ఒకటి అతి మాధుర్యాన్ని ఇంకొకటి ఆలోచనామృతాన్ని కలిగిస్తాయి. ఈ శ్లోకంలో సంగీత సాహిత్యాలని స్థనాలతో పోల్చడంలో ఒక ప్రత్యేకత ఉందని నా ఉద్దేశ్యం. శరీరంలో రెండేసి ఉన్నవి ఇంకా చాలా ఉన్నా అంటే కళ్ళు, చెవులు, చేతులు, కాళ్ళు, ఇవన్నీ కూడా ఆ శరీరానికి కావాల్సిన సౌకర్యం కూరుస్తాయి. స్థనాల ప్రత్యేకత ఏమిటంటే అవి బిడ్డలకి పాలిచ్చి, ఆకలిని తీరుస్తాయి. ఆ విధంగా సరస్వతిదేవి మన అందరి సంగీత, సాహిత్య పిపాస తీర్చగల తల్లిగా పోల్చడం చాలా గొప్ప ఉపమానం.

ఇంకా కొన్ని రోజులలో శరన్నవరాత్రులు మొదలవుతాయి గనక ఆ శారదాంబను అలాగే, లక్ష్మి ని, పార్వతిని తలపింప జేసే ఈ కృతులని విని ఆనందిస్తారని తలుస్తూ, మీ అందరికి దసరా శుభాకాంక్షలతో.

సంగీతం ఇదం పుణ్యం సంగీతం ఇదం సౌఖ్యం

సంగీతం ఆరోగ్యప్రదం సంగీతం శాంతియుతం

ఈమని వాసవాంబ కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొంది, సంగీతంలో హయ్యర్ గ్రేడ్ పట్టా అందుకున్న కళాకారిణి. ఆంధ్ర రాష్ట్రంలో పలు కచేరులు చేసేరు. వీరు హైదరాబాద్ వాస్తవ్యులు.

ప్రత్యేక ధన్యవాదాలు: ముగురమ్మల కృతులని, ముగ్గురమ్మలచేత పాడించాలన్న నా కోరిక తీరేటట్టు నాకు ఆప్తులైన శ్రీలక్ష్మి , చంద్రభాను, వాసవాంబలు పాడడం ఆ వరలక్ష్మి నాకందించిన వరం. మా నాన్నగారు కీ. శే. శ్రీ మునుకుట్ల

వెంకట కామోజీరావు. వారికి లలితా పరమేశ్వరి ఆరాధ్య దైవం. అందుకు ఈ దసరాల్లో ఆయనకు నివాళిగా కాంభోజి రాగంలో (వారి పేరున్న రాగం) పరమేశ్వరి మీద కృతులకై వెదకితే "దేవి నీ పద సారసములే దిక్కు" అన్న కృతి దొరికింది. అది అపూర్వ కృతి. ఆ కృతిని నా ఆప్త మిత్రురాలు శ్రీలక్ష్మి ని పాడమని కోరగానే ఆవిడ వెంటనే అంగీకరించి, అప్పటికప్పుడు స్వయంగా నేర్చుకుని, తగు సమయానికి అందించినందుకు సదా నా కృతజ్ఞతలు. అలాగే, ఎనభై ఏళ్ళ మా అక్క వాసవాంబ సుమారు పాతికేళ్ళగా సంగీత సాధన లేక పోయినా సరస్వతి మీద కృతిని పాడమని కోరగానే ఒప్పుకుని, పాట రికార్డు చేసి పంపించినందుకు నా అభివాదములు. మా నాన్నగారి సంతానంలో ఆద్యంతాలు ఈ విధంగా వారిని తలుచుకోవడం ఇంకొక మహత్వరం. ఇంక ఆఖరుగా ఏ కృతి అయినా అడిగిన వెంటనే అలవోకగా అందించే నా అనుంగు ఆడబడుచు చంద్రభానుకి నా ధన్యవాదాలు.

COMMENTS